ప్రజాశక్తి

శనివారం 16 డిసెంబర్ 2023

5

పార్వతీపురం మన్యం

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

**గుమ్మలక్ష్మీపురం /కురుపాం** : పాలకొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహణకు వెళ్తున్న సత్యనారాయణ అనే కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురం నుంచి పాలకొండ వెళ్తుండగా కొండబారిడి వస్తున్న బైక్ బలంగా ఢీ కొట్టడంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతిచెందారు. సత్యనారాయణ స్వగ్రామం గుమ్మలక్ష్మీపురం మండలం జాతపు కలిగొట్టు. ప్రమాదం జరిగిన వెంటనే వైద్యం కోసం భద్రగిరి సిహెచ్‌సికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న కరిమానుగూడకు చెందిన నిమ్మక సంతోష్‌కు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవింగ్ చేసిన బిడ్డిక రంజిత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సత్యనారాయణ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న భార్య లోతో దిబో మంటూ భర్త మృదేహంపై పడుతూ సొమ్మసిల్లి పోయింది. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆశాలపై పోలీసుల నిర్బంధం

సిఐటియు నాయకులు ఇందిరను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

- వినతి ఇచ్చేందుకు కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా అడ్డగింత
- నిరసనగా ఆశా వర్కర్ల రాస్తారోకో
- ఆశా, సిఐటియు నాయకులు అరెస్టు, విడుదల
- నాయకులతో అధికారుల చర్చలు

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

దీర్ఘకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పార్వతీపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట 36 గంటల నిరవధిక దీక్ష, వంటా వార్పు కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి అందించేందుకు వెళుతున్న, ఆశా వర్కర్లను, సిఐటియు నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా అదుపులోకి తీసుకుని సీతానగరం పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సంఘటనలో పోలీసుల తీరుపై సిఐటియు, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న వారిపై పోలీసుల దౌర్జన్యం ఏమిటని ప్రశ్నించారు. కనీస వేతనాలు చెల్లించాలని, పని భారాన్ని తగ్గించాలని, ఆశ వర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యం తొలగించి ప్రభుత్వమే నియామకాలను చేపట్టాలని కోరుతూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఉదయం నుండి శుక్రవారం వరకు 36 గంటల పాటు మన్యం జిల్లా కలెక్టర్ ఎదుట పెద్ద ఎత్తున పాల్గొని ఆశ వర్కర్లంతా నిరవధిక దీక్షను చేపట్టారు. రాత్రంతా చలికి, నిద్రకు లెక్కచేయకుండా ఏకతాటిపై నిలిచి, శిబిరంలోని వంటవార్పు చేసుకుని శుక్రవారం మధ్యాహ్నం విజయ వంతంగా కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలంతా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకుని కలెక్టర్‌కు వినతి అందించేందుకు నాయకులు లోపలికి వెళ్తుండగా డిఎస్‌పి మురళీధర్ ఆధ్వర్యంలో పోలీసులు గేటు వద్ద అడ్డుకున్నారు. అధికారులు వచ్చి వినతి పత్రం స్వీకరించాలని నాయకులు కోరగా, కలెక్టర్ కార్యాలయంలో లేరని, జెసి మీటింగ్‌లో ఉన్నారని వేచి ఉండాలని పోలీసులు చెప్పారు. ఎంతసేపటికి అధికారులు రాకపోవడంతో తామే అధికారుల దగ్గరికి వెళ్తామని, అనుమతించాలని పోలీసులను సిఐటియు నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నందుకు నిరసనగా ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. పోలీసులు ఆశా వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులపై ఒక్కసారిగా విరుచుకుపడి బలవంతంగా వారిని వాహనాలపై స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సిఐటియు నాయకులు వి.ఇందిర, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, ఉమామహేశ్వర రావు, పలువురు ఆశా కార్యకర్తలు ఉన్నారు. విషయం తెలిసి సంఘటనా స్థలానికి చేరుకున్న సిపిఎం నాయకులు రెడ్డి వేణు వినతిపత్రం అందించడానికి అభ్యంతరం ఏముందని పోలీసులను ప్రశ్నించడంతో పరిమిత సంఖ్యలో ఆశావర్కర్లను కలెక్టరేట్‌లోకి అనుమతించారు. అనంతరం జెసి గోవిందరావుకు సమస్యలపై వినతి అందించారు.

**సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగిస్తాం**

తొలుత దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులలో తమ ప్రాణాలను లెక్కచేయకుండా వైద్య సేవలు అందించిన ఆశా వర్కర్ల సేవలను గుర్తించి ప్రభుత్వం వారికి కనీస వేతనాలు చెల్లించాల్సింది పోయి, వారికి పనికి సంబంధంలేని పనులు చేయించుకుంటూ అధికారులు సైతం వేధిస్తున్నారని అన్నారు. చాలీచాలని జీతాలతో కనీస గౌరవం లేని విధులను వారు నిర్వర్తించడం బాధాకరమని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ ఆశాలకు ప్రమాద, ఆరోగ్య బీమా బీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని, ఉదయం 9 నుండి సాయంత్రం 5గంటల వరకు విధిగా ఉపఆస్పత్రిలో ఉండాలని నిబంధన పెట్టి వైద్య అధికారులు వేధింపులు ఆపాలని కోరారు. ఏకధాటిగా 36 గంటల దీక్షలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన స్ఫూర్తితో ముందు ముందు మరింతగా ఉద్యమించేందుకు ఆశాలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల నాయకులు ఎం.శివాని, టి.పద్మావతి, ఎలిగాడ లక్ష్మి, వి.మాలతమ్మ, బి.పద్మ, ఎ.శారద, సిఐటియు కోశాధికారి జివి రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘ పాకల సన్యాసిరావు, సిఐటియు నాయకులు సంచాన ఉమామహేశ్వరరావు బి సూరిబాబుతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి వచ్చిన ఆశ కార్యకర్తలు, సిహెచ్‌డబ్ల్యూలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద బైఠాయించిన ఆశా కార్యకర్తలు

**సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం : డిఎంహెచ్‌ఒ**

దీర్ఘకాలంగా ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహించిన 36 గంటల దీక్షకు అధికారులు స్పందించారు. సమస్యలపై దీక్ష అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావును కలిసి వినతి అందించారు. దీనికి జెసి స్పందించిన ఆయన జిల్లా వైద్యాధికారికి సమస్యపై స్పందించాలని కోరగా, ఆయన దీక్షా శిబిరానికి చేరుకున్న ఆయన ఆశ వర్కర్లకు హామీని ఇస్తూ మీ సమస్యలను పరిష్కరించేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

# పోలమాంబా... అభివృద్ధి గురించి ఎవరికి మొక్కాలి!

- యాత్రికుల ఇబ్బందులు పట్టని దేవాదాయ శాఖ
- రాష్ట్ర జాతరగా గుర్తించినా అభివృద్ధికి నోచని వైనం
- పండగ ఏర్పాట్లపై నేడు సమీక్ష

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ జాతరను రాష్ట్ర స్థాయి జాతరగా ప్రభుత్వం గుర్తించినా ఆ దిశగా అభివృద్ధికి నోచుకోలేకపోవడంతో యాత్రికులకు అవస్థలు తప్పడం లేదు. ప్రతి జాతర ముందు అధికారులు, రాజకీయ నాయకులు హడావుడి చేస్తూ సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు తప్ప జాతరకు వచ్చే యాత్రికులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై శాశ్వత ప్రణాళికలు చేయడంలేదు. యాత్రికుల నుండి వచ్చే ఆదాయం తాత్కాలిక ఏర్పాట్లతో హారతి కర్పూరంలా కరిగిపోతుంది తప్ప ప్రయోజనం ఏమీ లేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. ఏళ్ల తరబడి అమ్మవారి దర్శనానికి వచ్చే వారికి నిలువు నీడ లేక అవస్థలు పడాల్సి వస్తుంది. ఇప్పటికే లక్షలాది రూపాయల ఆదాయాన్ని ఆర్జిస్తున్న దేవాదాయ శాఖకు మాత్రం భక్తులు అవస్థలు పట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షలాదిగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు కనీసం వందమందైనా కూర్చునే ప్రశాంతమైన చోటు లేదంటే ఆశ్చర్యం కలగక మానదు. చదురు గుడి, వనం గుడిలను అభివృద్ధి చేస్తామంటూ ఏటా ప్రతిపాదనల మాట వినిపిస్తున్నప్పటికీ అవి పనుల రూపంలో కార్యరూపం దాల్చకపోవడం నేతి బీర మాటలు లాగే మిగిలిపోతుందని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదికి ఒకటి చొప్పున శాశ్వత పని చేపట్టినట్లయితే ఈపాటికి ఆలయ అభివృద్ధి అమోఘంగా ఉండేదని పలువురు చర్చించుకుంటున్నారు. నామినేటెడ్ పదవుల కోసం ఆత్రం పడే స్థానిక నేతలు ఆలయ అభివృద్ధి విషయంలో అనుకున్నంత రీతిలో చిత్తశుద్ధి కనబరుచకపోవడంతో చదురు గుడి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న రీతిగా తయారైందని పలువురు ఆక్షేపిస్తున్నారు. కనీసం భక్తుల విశ్రాంతి కోసం శాశ్వత రేకు షెడ్ నిర్మించలేకపోవడం దేవాదాయశాఖకు యాత్రికులపై ఉన్న శ్రద్ధ ఎలా ఉందో అర్థమవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. జాతరకు నెల రోజులు ముందు నిర్వహించే సమీక్షల వల్ల ఆలయాలు అభివృద్ధికి ఒరిగేదేమీ లేదని పలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి సంబర పోలమాంబ ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

**పాత బోర్డు.. ఉత్సవ కమిటీ..**

ఈ ఏడాది జాతర నిర్వహణ ఎలా ఉంటుందన్నది సందిగ్ధంగానే ఉంది. ఆలయ ట్రస్ట్ బోర్డు గడువు కాలం ముగిసిపోగా కొత్త బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖంగా లేకపోవడంతో ఈసారి జాతర నిర్వహణ ఎలా చేస్తారన్నది సస్పెన్షన్. పాత బోర్డు కొనసాగింపుగా జాతర కొనసాగిస్తారా లేక కొత్తగా ఉత్సవ కమిటీ ఏర్పాటు చేస్తారన్నది బహిర్గతం చేయాల్సి ఉంది. జాతర సమయం సమీపిస్తున్నప్పటికీ కొత్తగా నియమించిన ఇఒ ఇంకా పూర్తిగా ఆలయ వ్యవహారాలు అవగాహన చేసుకోవాల్సి ఉన్నప్పటికీ జాతర సక్రమ నిర్వహణకు స్థానిక నేతలతో చర్చలు జరిపి వారి సహకారం అర్జించాల్సిన పరిస్థితి ఉంది.

**నేడు జిల్లా కేంద్రంలో సమీక్ష**

జనవరి 22, 23, 24 తేదీల్లో జరగనున్న శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు సంబంధించి పార్వతీపురంలో ఆర్‌డిఒ అధ్యక్షతన ఉన్నతాధికారులతో శనివారం సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జాతర నిర్వహణపై పలు అంశాలు చర్చకు దారి తీయవచ్చు. ముఖ్యంగా దేవాదాయశాఖ ప్రతిష్టాత్మకమైన జాతరకు శాశ్వతమైన కార్యనిర్వహణ అధికారిని నియమించకపోవడం, ఏడాదికొక ఇన్చార్జి అధికారి నియమిస్తూ చేతులు దులుపుకుంటూ వస్తుంది. ఇలా చేయడం వల్ల జాతర సమయంలో అటు అధికారులు, ఇటు ప్రజలు కొంత ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈసారి ట్రస్ట్ బోర్డు లేకపోవడంతో అనుభవం ఉన్న అధికారితో జాతర నిర్వహిస్తే బాగుంటుందని పలువురు చర్చించుకుంటున్నారు.

# షేక్ సాబ్జీ మృతికి నివాళి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అకాల మరణం పట్ల సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం బడుగు బలహీన వర్గాలతో పాటు విద్యా రంగాలకు తీరని లోటన్నారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మథరావు, కోశాధికారి జివి రమణ, వి.ఇందిర, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసిరావు, యుటిఎఫ్ నాయకులు ఎస్ మురళీమోహన్, టి.మురళి తదితరులు ఉన్నారు.

**వీరఘట్టం:** ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి యుటిఎఫ్ మండలశాఖ స్థానిక ఎంఆర్సి ఆవరణలో సంతాపం తెలిపింది. పోరాట మార్గం సరైన మార్గమని, మీరు చెప్పిన పోరాట మార్గంలో ప్రతి కార్యకర్త మీ ఆశయాలు సాధిస్తామని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ ఆనందరావు, యుటిఎఫ్ నాయకులు ఎం.పైడిరాజు, కురుమాన గోవిందరావు, కె.గౌరునాయుడు, బి.దుర్గాప్రసాద్, ఎస్.మహేష్, వి.శ్రీధర్, ఎ.చంద్రమోహన్, సిహెచ్ వాసు, ఎ.సురేష్, ఆర్.జగదీష్, ఎం.దుర్గారావు, ఎన్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

**సీతంపేట** : షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదములో మృతి చెందడం పట్ల ఆదివాసీ మాతృ బహు భాషా ఉపాధ్యాయులు, ఏజెన్సీ అదిమ గిరిజన పిల్లలకు తీరని లోటని సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సవర డొంబు, పాంగి శ్రీను ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారి కొర్ర సర్బునాయుడు, మఠ్రి చిట్టిబాబు, సీదిరి మహేష్, తదితరులు ఉన్నారు.

వీరఘట్టంలో సాబ్జీకి సంతాపం తెలుపుతున్న ఉపాధ్యాయులు

# సమ్మె మరింత ఉద్ధృతం

- కళ్లకు గంతలు కట్టుకొని అంగన్‌వాడీల నిరసన
- భారీ ర్యాలీలు
- అణచి వేయాలని చూస్తే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక

గుమ్మలక్ష్మీపురంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కేంద్రాలను బలవంతంగా తెరవడం ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే మరింతగా ఉద్యమించి అంగన్వాడీలు విజయం సాధిస్తారని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అన్నారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు తలపెట్టిన నిరవధిక సమ్మె నాలుగవ రోజు శుక్రవారం విజయవంతంగా కొనసాగింది. దీక్షా శిబిరానికి శ్రీదేవి సంఘీభావం తెలుపుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చమని కోరడమే అపరాధంగా భావించిన ప్రభుత్వం అణిచివేతలకు పాల్పడుతుందని విమర్శించారు. తక్షణమే వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం ప్రాజెక్టు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**సాలూరు** : తమ సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ స్పష్టం చేసింది. సమ్మెలో భాగంగా నాలుగో శుక్రవారం యూనియన్ నాయకులు బి.రాధ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ధర్నా చేస్తున్న ప్రదేశం నుంచి ర్యాలీ చేపట్టారు. మెయిన్ రోడ్డు మీదుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ బాలమురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల, వరలక్ష్మి,ఎ.నారాయణమ్మ, శశికళ పాల్గొన్నారు.

**కళ్లకు గంతలు కట్టుకొని అంగన్వాడీల నిరసన**

**గుమ్మలక్ష్మీపురం** : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ ఉద్యోగులు చేపడుతున్న సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు సమ్మె శిబిరం వద్ద నల్ల చీరలు ధరించి, కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జగదీష్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు, నాయకులు పువ్వల మోహన్‌రావు, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యవతి, కస్తూరి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

**సీతంపేట** : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కాంతారావు సురేష్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పార్వతి దర్శిమీ తదితరులు ఉన్నారు.

**సీతానగరం** : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం కొనసాగింది. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సత్యవతి, సునీత, లక్ష్మి, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, ఆర్.ఈశ్వరరావు, వై.రామారావు, జనసేన నాయకులు శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**కొమరాడ** : అంగన్‌వాడీల నిరవధిక సమ్మెల్లో భాగంగా కొమరాడలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు ర్యాలీ నిర్వహిస్తూ తహశీల్దార్‌కు, ఎంపిడిఒకు, ఎస్ఐకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం కొమరాడ సెంటర్ మెయిన్ రోడ్డు నుంచి అంతర్‌రాష్ట్ర రహదారి పైన ర్యాలీగా వెళ్తూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కొమరాడ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు సిరికి అనురాధ, సెక్టార్ నాయకులు బి.అలివేలు, జ్యోతి, పద్మ, జయమ్మ, మల్లేశ్వరమ్మ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడారు.

**కురుపాం** : స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శిబిరం వద్దకు జన సైనికులు వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపడుతుంటే ప్రభుత్వం వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కేంద్రాల్లో తెరిపించడం అన్యాయమన్నారు. అంగన్వాడీ సమ్మెకు జనసేన సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, వారికి అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో జనసైనికులు ఎన్.వంశీ, జి.గౌరి, సిఐటియు నాయకులు ఎం.శ్రీనివాస్, జన సైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొమరాడలో ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీలు

పార్వతీపురంలో అంగన్‌వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి

**గరుగుబిల్లి:** సమస్యలు పరిష్కారం కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె నాలుగోరోజు శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో మానవహారం చేపట్టారు. అలాగే ర్యాలీగా వెళ్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయ అధికారులకు, ఎంపిడిఒ కార్యాలయ అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్ గౌరమ్మ, ఎం.సరస్వతి, పలువురు అంగన్‌వాడీలు పేర్కొన్నారు.

**అంగన్వాడీ కేంద్రాల తలుపులు బద్దలు**

**పార్వతీపురంటౌన్:** తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరుతూ గత నాలుగు రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఈ తరుణంలో శుక్రవారం ఉదయం పట్టణంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ సిడిపిఒ పి.శ్రీనివాసరావు, అంగన్వాడీ ప్రాజెక్టు సెక్టార్-2 సూపర్వైజర్ ఎం.అమ్మరాజు, మునిసిపల్ ఎఎస్ఒ పిబివి వీరి నాయుడు, సచివాలయ సిబ్బందితో బలవంతంగా అంగన్వాడీ కేంద్రాల తలుపుల తాళాలను పగలగొట్టారు. లోపల ఉన్న పౌష్టికాహారం సరుకుల పంపిణీ వివరాలను నమోదు చేసుకుని వేరొక తాళాలను వేస్తూ వార్డు సచివాలయ మహిళా పోలీసులు, మెప్మా సిబ్బంది, మహిళ వాలంటీర్లకు అంగన్వాడీ కేంద్రాల బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సెక్టార్ నాయకులు ముట్నూరు గౌరీ మాట్లాడుతూ అంగనవాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా ధర్నా చేస్తున్న తరుణంలో ప్రభుత్వం బలవంతంగా అంగన్వాడీ కేంద్రాలను అధికారులతో తాళాలు పగలగొట్టి తెరిపించడం అన్యాయమని, దీనివల్ల ఈ కేంద్రాలను అద్దెకిచ్చిన యజమానుల వల్ల తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. అదే జరిగితే కేంద్రాల్లో ఉన్న సరుకుల పరిస్థితి ఏమిటి అని ప్రభుత్వం పునరాలోచించాలని అన్నారు.

సాలూరులో భారీ ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

**గుమ్మలక్ష్మీపురం** : గత నాలుగు రోజుల నుంచి అంగన్వాడీలు సమ్మె బాట పట్టడంతో మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు మహిళా పోలీసులు, సచివాలయ, ఐకెపి సిబ్బంది తాళాలు విరగ్గొట్టి కేంద్రాలను తెరిచారు. ఇందులో భాగంగా ఎల్విన్‌పేట, లక్క గూడ, ఇరిడి, దుడ్డుఖల్లు తదితర గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల తాళాలను విరగగొట్టి తెరిచారు. శుక్రవారం ఎల్విన్‌పేట-2 అంగన్వాడీ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి శ్యామల, మహిళా పోలీస్ పార్వతి, అంగన్వాడీ సూపర్వైజర్, ఐకెపి సిబ్బంది విరగగొట్టి తెరిచారు.

**వీరఘట్టం** : అంగన్వాడీ కేంద్రాలు తప్పనిసరిగా తెరవాలని ఎంపిడిఒ వై.వెంకటరమణ అంగన్వాడీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని దుర్గపేట వీధిలో తాళాలు వేసి ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని కుటుంబ సభ్యులతో మాట్లాడి తెరిపించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలన్నారు. మండలంలోని 73 ప్రధాన అంగన్వాడి కేంద్రాలు, 18 మినీ అంగన్వాడి కేంద్రాలు ఉండగా 73 కేంద్రాల్లో 15 తెరిచినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు సూపర్వైజర్లు ఎన్.రాజేశ్వరి, జె.జ్ఞానమ్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో అంగన్‌వాడీ కేంద్రం తాళం విరగ్గొడుతున్న సిడిపిఒ

## అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను ప్రతి నిరుద్యోగ యువతీ యువకులు ఉపయోగించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శుక్రవారం స్థానిక గాయత్రి డిగ్రీ కాలేజీలో జరిగే జాబ్ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో 16 కంపెనీల సభ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ఎంపికైన వారికి అర్హత పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం పార్వతీపురంలో స్కిల్ డెవలప్మెంట్ హబ్ భవనం నిర్మాణం ప్రారంభించి, అతి త్వరలో అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణను అందిస్తామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి అదే భవనంపై వసతి కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి సాయికుమార్ మాట్లాడుతూ జాబ్ మేళాకు సుమారు 521మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, అందులో 136 మంది వివిధ కంపెనీల్లో ఎంపికైనట్టు తెలిపారు. టిడ్కో చైర్మన్ జమ్మాన్న ప్రసన్న కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఇలాంటి జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు పొందాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ నైపుణ్యాభివృద్ధి అధికారిణి రోహిణి, జూనియర్ ఎంప్లాయి మెంట్ అధికారి వహీదా, గాయత్రి కళాశాల కరెస్పాండెంట్ మణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మిల్లుల వద్ద వెంటనే అన్‌లోడ్ చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పాలకొండ

మిల్లుల వద్ద లారీలను వెంటనే అన్ లోడ్ చేయాలని ఆర్‌డిఒ ఎం.లావణ్య ఆదేశించారు. మండలంలోని అంపిలి రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. తుమరాడ మారుతి రైస్ మిల్ దగ్గర శుక్రవారం నుంచి ధాన్యంతో లారీ ఉండడాన్ని ఆమె ప్రశ్నించారు. లారీలను వెంటనే అన్‌లోడ్ చేయాలని మిల్ యాజమాన్యాన్ని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుసంధానమై వాహనాలు జీపీఎస్ విధిగా ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది రైతులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తేమ శాతం, ధాన్యం సంచులు, రవాణా ఖర్చులు తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన అవసరమని ఆమె అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని తక్షణం అనుసంధానించిన మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కస్టోడియన్ అధికారులు విధిగా ఉండాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తరాదని అన్నారు. కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## ఆడలి వ్యూ పాయింట్ పనులు వేగవంతం

ప్రజాశక్తి - సీతంపేట

ఆడలి వ్యూ పాయింట్ వద్ద చేపడుతున్న ఇంజనీరింగ్ పనులను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి ఆదేశించారు. శుక్రవారం ఆడలి వ్యూ పాయింట్ పనులను ఆమె పరిశీలించారు. సంబంధిత ఎఇతో జరుగుతున్న పనులపై చర్చించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. పనులను మరింత వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెలాఖరుకు పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ నాగభూషన్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'వైద్యాధికారులపై ఆరోపణలు తగవు'

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విధి నిర్వహణలో భాగంగా పరిశీలనకు వెళ్లిన వైద్యాధికారులపై వలసబల్లేరు ఎన్ఎంపిహెచ్ గౌరీ లక్ష్మి ఆరోపణలు తగవు అని వైద్య ఉద్యోగుల జేఏసీ నాయకులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్యాధికారి జగన్నాథరావును కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా మొండెంఖల్ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రజ్ఞ, హెల్త్ విజిటర్ కె.భారతి వలసపల్లేరు సబ్ సెంటర్ ను తనిఖీ చేసి అక్కడి లోపాలను గుర్తించగా, పై అధికారులకు తెలియజేస్తామనే ఉద్దేశంతో అక్కడి ఉద్యోగి గౌరీలక్ష్మి అందుబాటులో ఉన్న మాత్రలను అధిక మొత్తంలో సేవించి, డాక్టర్లపై ఆరోపణ చేయడం సబబుగా లేదని అన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు తేల్చాలని జిల్లా వైద్యాధికారిని కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఉద్యోగుల జేఏసీ నాయకులు డాక్టర్ తిరుమల ప్రసాద్, జివి కిషోర్, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

# మిల్లర్ల వద్దకు వెళ్లొద్దు

## ఆర్‌బికెలనే సంప్రదించాలి : జెసి

**ప్రజాశక్తి - పార్వతీపురం**

రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకొనేందుకు, ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర పొందుటకు రైతుభరోసా కేంద్రాలను సంప్రదించాలని జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు తెలిపారు. జిల్లా వ్యవసాయ, నీటిపారుదల సలహా మండలి సమావేశాలు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ ఇక్రాప్ చేసిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం మిల్లులకు సరఫరా చేస్తున్నామన్నారు. కావున రైతులకు, మిల్లర్లకు మధ్య ఎటువంటి సంబంధం ఉండదని, మొత్తం కస్టోడియన్ బాధ్యత వ్యవహరిస్తారని, ఎవరైనా మిల్లర్లు రైతులను సంప్రదించాలని కోరితే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు వాకాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో గతేడాది ఎదురైన లోటుపాట్లు అధిగమించి ఏర్పాట్లు చేశామన్నారు. తుపానుకు పాడైన ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలులో రైతులకు, మిల్లర్లకు మధ్య ఎటువంటి సంబంధం లేకుండా చూడాలని అన్నారు. అలాగే సాగునీటి కాలువల నిర్వహణ వేసవిలో పంటకాలానికి ముందుగానే చేపట్టాలని ఇరిగేషను అధికారులకు సూచించారు. పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి మాట్లాడుతూ తన నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో రైస్ మిల్లులు తక్కువగా ఉన్నాయని, సార్టెక్స్ సదుపాయం, బ్యాంకు గ్యారంటీల కారణంగా ధాన్యాన్ని స్థానిక మిల్లులకు తరలించేందుకు వీల్లేకపోతే గోదావరి జిల్లాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే మత్స్యశాఖకు సంబంధించి సుమారు 12 లక్షల చేపపిల్లలను మత్స్యకార సంఘాల ద్వారా చెరువులలో వదలడం జరుగుతుందని, కానీ వాటినుండి ఆశించిన దిగుబడిరావడం లేదన్నారు. చేపలు ఎదగకముందే చెరువుల్లో నీరు తగ్గిపోతుందని, కావున నీరు నిల్వ చేసేందుకు అవకాశం గల చెరువుల్లో తూముల నిర్మాణం చేపట్టాలని, నీరు నిల్వ ఉండేలా ఉపాధి హామీ పనులు చేపట్టాలని, జూలై, ఆగష్టు మాసాల్లో చేప పిల్లలను పంపిణీ చేయాలని అధికారులకు తెలిపారు. ఈ ప్రాంతంలో సీజనల్ వచ్చే ఫైనాపిల్, సీతాఫలం పంటలకు ఒక్కొక్కసారి సరైన ధరరాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కావున విభిన్న పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహకాలను అందించాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి కె రాబర్ట్ పాల్ మాట్లాడుతూ జిల్లాలో తుపాను కారణంగా రూ.56 లక్షల పంటనష్టం సంభవించినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. పూర్తి నష్టం వివరాలకు కమిటీ వేశామని, ఈ కమిటీ ఈనెల 18 నాటికి నివేదిక అందజేస్తుందని, సచివాలయం స్థాయిలో సోషల్ ఆడిట్ అనంతరం ఈనెల 26న తుది నివేదిక అందజేస్తామనితెలిపారు. పంట నష్టాన్ని రైతులకు సంక్రాంతి ముందుగానే అందజేస్తామన్నారు. మండల స్థాయిలో వ్యవసాయ సలహా మండలి సమావేశాలలో టార్పాలిన్లు సరఫరా, వ్యక్తిగతంగా రాయితీపై వ్యవసాయ పరికరాలు మంజూరు, కాలువలలో పూడికతీత తీయాలని, రంగుమారినధాన్యం సేకరణ మొదలైన అంశాలపై తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంలో భాగంగా జిల్లాలో 8వేల హెక్టార్లలో అపరాలు సాగుకు విత్తనాలు రాయితీపై పంపిణీ చేసినట్టు తెలిపారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించిన మిల్లులకే పంటను పంపిస్తున్నామన్నారు. సంచులు ఆర్‌బికెలకు సరఫరా చేశామన్నారు. జిల్లా జలవనరుల శాఖ ఎస్ఇ వై.వి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో ప్రాజెక్టులు ఖరీఫ్ పంటకు సాగునీరందించేందుకేనని, రబీ సాగుకు ప్రణాళిక లేదని తెలిపారు. ప్రాజెక్టుల పనులకు ప్రతిపాదనలు సిద్ధంచేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి కె.ఎస్. వరప్రసాద్, జిల్లా సహకార అధికారి బి. సన్యాసి నాయుడు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, ఇతర అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి గోవిందరావు, ఎమ్మెల్యే కళావతి, చైర్మన్

# పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

**ప్రజాశక్తి - పార్వతీపురం**

ఆంధ్ర రాష్ట్ర సాధకుడు అమరజీవి పొట్టి శ్రీరాములని, ఆయన ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు తెలిపారు. శుక్రవారం పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేషకృషి చేసిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని, ఆయన ప్రాణత్యాగ ఫలితంగా భాషాప్రయుక్తరాష్ట్రాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాముల జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని జెసి తెలిపారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య, మార్కెటింగు ఎడి ఎల్. అశోక్ కుమార్, సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ దేవుళ్ల నాయక్, నీటిపారుదల ఎస్ఇ వై.వి.రాజరాజేశ్వరి, జిల్లా కోపరేటివ్ అధికారి బి.సన్యాసినాయుడు, కలెక్టరు కార్యాలయ సూపరింటెండెంట్లు శ్రీరామూర్తి, రవికుమార్, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**సీతంపేట :** అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలు ఆదర్శనీయమని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, ఇఇ సింహాచలం, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి, పిఎఒ హరికృష్ణ, ఎఎఒ విజయ రాణి, ఐటిడిఎ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములకు నివాళులర్పిస్తున్న పిఒ కల్పనాకుమారి

**బాలికల ఆశ్రమ పాఠశాలలో వర్ధంతి వేడుక**

ఆంధ్ర రాష్ట్రం సాధన కోసం పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి స్థానిక బాలికల ఆశ్రమం పాఠశాలలో నిర్వహించారు. వీరి చిత్ర పట్టాలకు డిప్యూటీ డిఇఇ లిల్లీరాణి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బలిజిపేట :** మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు శుక్రవారం నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మిర్తివలసకు చెందిన వావిలపల్లి సన్యాసి నాయుడు, గొర్లె శ్రావణ్ కుమార్, సురగాలి సూర్య నారాయణ, చిరంజీవి, ఆచారి కోట, గౌరీనాథ్, పెంకి పరశురాం, డాక్టర్ శ్రీను, యువత పాల్గొన్నారు.

**వీరఘట్టం :** మండలంలోని పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడుకూరు, బొడ్డపాడులో జనసేన నాయకులు ఎం.పుండరీకం, జనసేన జానీలు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కె.పవన సాయి, సిహెచ్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న సంజీవరావు

## గిరిజన విద్యార్థిని మృతి బాధాకరం

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

మండలంలోని కేదారిపురం కాలనీ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బిడ్డిక సీత మూర్ఛ వ్యాధితో మృతి చెందడం పట్ల ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థిని మృతి చెందిన విషయం తెలియగానే చైర్మన్ అధికారులను ఆరా తీశారు. పాఠశాలకు దగ్గరలో మెరుగైన వైద్య సేవలు ఉండి కూడా ఇలాంటి సంఘటన జరగడం విచారకరమని పేర్కొన్నారు. ఈ సంఘటనపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, పైస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

## హెచ్ఎం రవికుమార్ మృతి

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

మండలంలోని రేగిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న రౌతు రవికుమార్ (61) వైద్యం పొందుతూ పూణేలో మృతి చెందారు. గుండె ఆపరేషన్ కోసం పూణే వెళ్లిన ఆయన చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించారు. శుక్రవారం ఉదయం తన స్వగ్రామమైన జియమ్మవలస మండలం పెదమేరంగికి తీసుకొచ్చారు. తోటి ఉపాధ్యాయుడు రవికుమార్ మృతి పట్ల శ్రీ శ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు, మండ పాఠశాల హెచ్ఎం పాలక దేవానంద్, కోర్ కమిటీ సభ్యులు పెద్దింటి నిర్మల్ కుమార్, గోపాల్, సూర్యనారాయణ ప్రసాదరావు ప్రగాఢ సంతాపం తెలిపారు.

## 17న పింఛనుదారుల సమావేశం

**ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్**

స్థానిక రైతు బజార్ వెనుక ఉన్న రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ దారుల సమావేశ మందిరంలో ఈనెల 17న ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే పెన్షన్‌దారుల దినోత్సవానికి రిటైర్డ్ పెన్షన్‌దారులంతా హాజరుకావాలని ఆ సంఘం కార్యదర్శి డి.గణపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పెన్షన్‌దారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పదిమంది పెన్షన్‌దారులను సత్కరిస్తామని, ఈ కార్యక్రమానికి కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొంటారని అన్నారు.

# రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

మండలంలోని కేదారిపురం ఆశ్రమ పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం సందర్శించారు. విద్యార్థిని సీత మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గంగారావు మాట్లాడుతూ విద్యార్థిని కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందడం లేదన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను తొలగించడంతో విద్యార్థులకు వైద్య సేవలందడం లేదన్నారు. దీంతో విద్యార్థుల మరణాల సంఖ్య ప్రతి ఏటా నమోదవుతూనే ఉందన్నారు. మండలంలో ఇప్పటివరకు నలుగురు విద్యార్థులు చనిపోయిన అధికారులు నివారణా చర్యలు తీసుకోవడంలో శ్రద్ధ వహించడం లేదన్నారు. విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం స్పందించి తక్షణమే ఎఎన్ఎంలను నియమించాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బి.అనిల్.ఎం ఇండియా ఉన్నారు.

**విద్యార్థిని మృతిపై విచారణ జరిపించాలి**

మండలంలోని కేదారిపురం కోలనీ గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని బిడ్డక సీత మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. గిరిజన విద్యా సంస్థల్లో విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేదన్నారు. హెల్త్ వాలంటీర్ల సేవలను రాష్ట్ర ప్రభుత్వం లేకుండా చేయడంతో విద్యార్థుల మరణాలు పెరిగాయన్నారు. ఇప్పటి వరకు మరణించిన విద్యార్థుల కుటుబాలకు రూ.5లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గంగారావు

**విద్యార్థుల మరణాలు బాధాకరం**

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందనిఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ అన్నారు. ప్రతి ఏటా జిల్లాలో విద్యార్థులు మరణాలు జరగడం బాధాకరమన్నారు. ఎన్నో ఆశలు ఎన్నో కలలతో చదువు కోసం వస్తున్న విద్యార్థులు పసిప్రాయంలోనే మృత్యు ఒడికి చేరడం బాధాకరమన్నారు. కేదారిపురం కాలనీ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతిపై ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు జరపాలని, మరణాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వైసిపి పాలనపై ప్రజల్లో అసంతృప్తి

**ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్**

సిఎం వైఎస్ జగన్ అస్తవ్యస్థ పాలనతో విసిగిపోయిన ప్రజలు మళ్లీ టిడిపి పాలననే కోరుకుంటున్నారని ఆ పార్టీ అరకు పార్లమెంటరీ ఇన్‌ఛార్జి కిడారు శ్రావణ్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు జరిగినా నాయకులు కార్యకర్తలు, సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇన్చార్జి విజయ్ చంద్ర మాట్లాడుతూ పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకు వెళ్లడంతో పాటు ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈనెల 20న భోగాపురంలో జరిగే యువగళం పాదయాత్రకు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డి.శ్రీదేవి, నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, పోల సత్యనారాయణ, జి రవికుమార్ బోను చంద్రమౌళి, బార్నాల సీతారాం, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, టి వెంకటరావు, బడే గౌరినాయుడు, కోల సరితా మధు, నియోజకవర్గం నుండి మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**టిడిపిలో చేరిన జనసేన నాయకులు**

పట్టణానికి చెందిన జనసేన నాయకులు జివి రమణారావు, వంగల దాలి నాయుడు టిడిపిలో చేరారు. టీడీపీ అరకు పార్లమెంట్ ఇన్చార్జ్ కిడారి శ్రావణ్ సమక్షంలో వారు పార్టీలో చేరారు.

# సైన్స్‌పై మరింత అవగాహన పెంచుకోవాలి

**ప్రజాశక్తి - కొమరాడ**

విద్యార్థులు సైన్స్‌పై నిరంత అవగాహన పెంపొందించుకోవాలని ఎంఇఒ జామి నారాయణస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర గురుకుల పాఠశాలలో సదరన్ సైన్స్ ఫెయిర్ 2023 కార్యక్రమం నిర్వహించారు. దీనికి మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి వచ్చి వ్యక్తిగత, గ్రూపులుగా సైన్సు ఎగ్జిబిట్స్ తెచ్చి ప్రదర్శించారు. అనంతరం ఎంఇఒలు నారాయణస్వామి, తిరుపతిరావు, విక్రాంపురం, కోటిపాం ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మణరావు సైన్స్ ఫెయిర్ ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు తెచ్చిన ప్రాజెక్టులను వివరించి చక్కగా అందరినీ ఆకట్టుకున్నారు. తర్వాత వ్యక్తిగతంగా ఒక ప్రాజెక్టును గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థి లక్ష్మీ ప్రసాద్ గేర్ బాక్స్ సంబంధించి ప్రదర్శనను ఎంపిక చేశారు. గ్రూపు ప్రాజెక్టుకు దలైపేటకు చెందిన డి.గౌతమ్, జి.దుర్గాప్రసాద్‌ను జిల్లా సైన్స్ ఫెయిర్‌కు ఎన్నిక చేశారు. ఈ కార్యక్రమం మండల సైన్సు కో-ఆర్డినేటర్ సిహెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

**మక్కువ:** స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సైన్స్ ఎగ్జిబిషన్లో మండలంలో వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు వారు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి మండల అధ్యక్షులు మావుడి రంగునాయుడు హాజరయ్యి విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలించిచారు. మూడు ప్రాజెక్టులు ఎంపిక చేసి ఈనెల 23న పార్వతీపురం జరిగే ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నారు. కార్యక్రమంలో ఎంఇఒ పెంట సత్యనారాయణ, శ్యాంసుందరరావు, ప్రధానోపాధ్యాయులు హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సీతానగరం :** మండలంలోని మరిపువలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైజ్ఞానిక విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమం ఎంఇఒ జి.సూర్యదేముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇటువంటి విజ్ఞాన తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులను ఈ విజ్ఞాన ప్రదర్శనలో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వైసిపి మండల నాయకులు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : ప్రదర్శనలను తిలకిస్తున్న ఎంఇఒ నాగభూషణరావు

**గరుగుబిల్లి :** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ఎంఇఒ ఎన్.నాగభూషణరావు తెలిపారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన పాఠశాలలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయిలో జరగనున్న విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొననున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.ప్రపూర్ణకుమారి, జె.సురేష్, గోవిందరావు, పక్కి రవీంద్ర, చంద్రమౌళి, సీఆర్పీలు బోను రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**వీరఘట్టం:** స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఇఒలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు ఆధ్వర్యంలో మండల స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కెజిబివి, గిరిజన ఆశ్రమం ఉన్నత పాఠశాలలతో పాటు ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రదర్శనలో మూడు విభాగాల్లో 39 ప్రాజెక్టులు ప్రదర్శించినట్లు ఎంఇఒ తెలిపారు. ఈ ప్రదర్శనలో ఎంపికైన ప్రాజెక్టులు ఈనెల 23న జిల్లా స్థాయిలో జరగబోయే ప్రదర్శనకు ఎంపికైనట్లు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.కుమారస్వామి, కత్తులకవిటి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పి.సుధారాణి, జిలక్ష్మణరావు, డిఎస్ఒ, ఎస్ సతీష్ పాల్గొన్నారు.

## పోడు భూములకు పట్టాలివ్వాలి

**ప్రజాశక్తి - సాలూరు**

మండలంలోని కొత్తవలస పంచాయతీ పరిధిలో కరకవలస, జనవరివలస, కొత్తవలస, బుట్టుగానివలస గ్రామాల్లో నిరుపేద గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ వైసిపి నాయకులు నెమలి పిట్ట కళ్యాణ్ తహశీల్దార్ బాలమురళీకృష్ణకి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆయన కొంతమంది గిరిజనులతో కలిసి తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. అనేక ఏళ్లుగా నిరుపేద గిరిజనులు సాగులో ఉన్నారని, వారికి పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ రాయితీలు పొందలేకపోతున్నారని చెప్పారు. రైతు భరోసా, పంట నష్టపరిహారం వంటి పథకాలకు అర్హత లేకుండా పోయిందని చెప్పారు. సాగు భూములు సర్వే చేసి పట్టాలు పంపిణీకి కృషి చేస్తానని తహశీల్దార్ చెప్పారు.

## ఆత్మహత్యాయత్నంపై విచారణ జరపాలి

**ప్రజాశక్తి - కురుపాం**

మండలంలోని మొండెంఖల్ పిహెచ్‌సి పరిధిలో గల వలసబల్లేరుఎంఎల్‌హెచ్‌పి పి.గౌరీలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి దర్యాప్తు చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్ కుమార్ అధికారులను డిమాండ్ చేశారు. అలాగే కేడీ కాలనీ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల వసతి గృహంలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని బిడ్డిక సీత మృతిపై స్పందించిన ఎస్టీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ డివిజి శంకరరావుకు గిరిజన విద్యార్థి సంఘం తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నామని, విద్యార్థిని కుటుంబానికి ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

## 500 సారా ప్యాకెట్లు స్వాధీనం

**ప్రజాశక్తి - పాచిపెంట**

మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తనిఖీలు నిర్వహించగా అక్రమంగా తరలిస్తున్న 500 నాటు సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. సారా ప్యాకెట్లు అక్రమ రవాణా జరుగుతుందని ముందస్తు సమాచారం మేరకు పి.కోనవలస చెక్పోస్ట్ వద్ద సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా ఒడిశాలోని లావిడి గ్రామానికి చెందిన రిత, రమ్య, పారమ్మ, సునీత, బినతి ఘాట్ రోడ్ మీదుగా ఆంధ్రా వైపు అక్రమంగా 500 నాటు సారా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుబడ్డారు. వారి దగ్గర నుండి నాటు సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడిన వారంతా మహిళల కావడం పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## జాతీయస్థాయి క్రీడలకు గిరిజన విద్యార్థి ఎంపిక

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

67వ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పాఠశాల క్రీడలు అండర్- 14 విభాగంలో బాలురు, బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన గిరిజన విద్యార్థి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యాడు. మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న మండంగి శేఖర్ జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక పట్ల మండలాధికారులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 10 నుండి 12 వరకు కర్నూలు జిల్లా నంద్యాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో శేఖర్ కాంస్య పతకం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జనవరి 14 నుంచి 17 వరకు చత్తీస్గఢ్‌లోని జగదల్‌పూర్ ప్రియదర్శిని ఇండోర్ స్టేడియంలో జరుగు పోటీలకు వెళ్తున్నట్లు పిడి మాధవరావు తెలిపారు. జాతీయస్థాయి క్రీడలకు విద్యార్థి ఎంపిక కావడం పట్ల హెచ్ఎం నాగరాజు, డిప్యూటీ వార్డెన్ గంగారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

इंडियन बैंक Indian Bank
**ఇండియన్ బ్యాంక్ - సాలూరు బ్రాంచ్**
**పార్వతీపురం మన్యం జిల్లా**

**బంగారు ఆభరణాల వేలం ప్రకటన**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ తెలుపబడిన మా శాఖ యందు ఖాతాదారుడు బంగారు ఆభరణములు తాకట్టు పెట్టి ఋణము పొందియున్నారు. అట్టి ఋణం మొత్తం సకాలంలో చెల్లించని కారణంగా సాలూరు శాఖలో తేది 18-12-2023, సోమవారం వేలం నిర్వహించబడును.

| ఖాతా నెం. | ఋణ గ్రహీత పేరు తండ్రి/భర్త చిరునామా | ఐటమ్ | బరువు |
|---|---|---|---|
| 7040367461 | Avala Trinadh, S/o Simmayya Mathumuru Village, Pachipenta Madalam | తాడు - 01 | Grass Weight 17.4 Grams Net Weight 14.790 Grams |

వేలంపాటలో పాల్గొనదలచుకున్నవారు వివరములకు సంప్రదించగలరు.
బ్రాంచి మేనేజర్, సాలూరు బ్రాంచ్
సెల్ : 9100551683

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

## రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాశక్తి - సీతానగరం**

మండలంలోని అంటిపేట నుండి కోమటిపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణానికి రూ.5కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఎన్నో ఏళ్ల నుండి కలగా ఉన్న రోడ్డును పూర్తి చేయడానికి తనవంత కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో అంటిపేట సర్పంచ్ బొంగు తిరుపతిరావు, ఎంపిటిసి సభ్యులు చలపతి నిర్మల, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిపి బి.రమణమ్మ, శ్రీరాములు నాయుడు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, మాజీ ఎంపిపి రత్నాకర్‌రావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేత్ర చికిత్సలకు తరలింపు

**ప్రజాశక్తి - కురుపాం**

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇటీవల కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల సచివాలయాల పరిధిలో నిర్వహించిన నేత్ర పరీక్షల్లో కేటరాక్ట్ (అంతర కుసుమం), టెరిజియం(కొయ్యకండ) ఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా శస్త్ర చికిత్సల కోసం స్థానిక సిహెచ్‌సి నుంచి విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి శుక్రవారం తరలిస్తున్నట్లు జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్ళ జోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తున్నామని కంటి ఆపరేషన్ అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి వారికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు శైలజ, చామంతి మల్లిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపరేషన్లకు వెళ్తున్న వృద్ధులు

## ధాన్యం తరలింపు వేగవంతం చేయాలి

**ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్**

సకాలంలో ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని ఐటిడిఎ ప్రోజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ తెలిపారు. శుక్రవారం బెలగాంలో రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పిఒ తనిఖీ చేశారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో రైతులకు, మిల్లర్లకు ఎటువంటి సంబంధం ఉండదని, కస్టోడియన్ అధికారులదే పూర్తి బాధ్యతని తెలిపారు. ఆర్‌బికె పరిధిలో మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రానికి సంబంధించిన సమాచారాన్ని అధికారులు పిఒకు వివరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి అధికారులు, రైతుభరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డిడి మంగవేణి

## ఆశ్రమ పాఠశాల పరిశీలన

**ప్రజాశక్తి - సీతంపేట**

మండలంలోని దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ జి.మంగవేణి శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యం మేరకు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకున్నారు. టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ ఏడాది శతశాతం వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి ముందుకు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాలలో అమలవుతున్న మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. డిడి వెంట ప్రధానోపాధ్యాయులు కొండ గొర్రె సుబ్బారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## అంకిత భావంతో సేవలందించాలి

**ప్రజాశక్తి పార్వతీపురం రూరల్**

గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సిద్ధింప జేస్తూ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థలో ఉద్యోగులు అంకితభావంతో ప్రజలకు సేవలు అందించాలని ఎపి స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయితీరాజ్ (ఏపీఎస్ఐఆర్డీపీఆర్) డైరెక్టర్ జె.మురళి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో జరుగుతున్న సచివాలయ సిబ్బంది వాలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉంటే తప్పులు చేసే అవకాశం ఉండదన్నారు. కార్యక్రమములో ట్రైనింగ్ అబ్జర్వర్ కేశవరెడ్డి, డిఎల్‌డిఒ ఎన్.రమేష్‌రామన్, ఎంపిడిఒ అఖీబ్ జావేద్, డిఎల్‌పిఒ ఎం.నాగభూషణరావు, ఇఒపిఆర్‌డి ఎన్.కృష్ణపాల్గొన్నారు.

## బాలగొడబలో అభివృద్ధి పనులు

**ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్**

మండలంలోని బాలగొడబలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో కొత్తగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం పనులను శుక్రవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలో అవసరమైన సిసి రోడ్లు, కాలువలు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పండు, పోలమ్మ, మాజీ సర్పంచ్ ఎం.సత్యం నాయుడు, వైస్ సర్పంచ్ వి.శ్రీనివాసరావు, స్టేట్ డైరెక్టర్, గ్రామ నాయకులు, కార్యకర్తలు, గహ సారథులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం పరిశీలన

**ప్రజాశక్తి - సీతంపేట**

మండలంలోని దారిమల్లి, దెబ్బమానుగూడ, దిబ్బగూడ గ్రామాల్లో ఎపి రైతు సాధికార సంస్థలు నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని శుక్రవారం ఢిల్లీ నుంచి వచ్చిన రైతు సాధికారిక సంస్థ ఇండియన్ ఫెలో ప్రతినిధి అనుప్ కుమార్ దేవ్ పరిశీలించారు. దారిమల్లిలో జొన్న పంటను పరిశీలించి రైతు రోజారమణి ఆదాయం గురించి తెలుసుకున్నారు. దెబ్బమానగూడలో ప్రసాదు, దిబ్బ గూడలో రైతు బి.శ్రీను ప్రకృతి వ్యవసాయంపై ఎలా చేస్తున్నారో తెలుసుకున్నారు. విడివికె ద్వారా నిర్వహిస్తున్న ప్రాసెసింగ్ యూనిట్ పశువు ప్రాసెసింగ్ ఏ విధంగా చేస్తున్నారో పరిశీలించారు. కార్యక్రమంలో సాధికారిక సంస్థ సభ్యులు ముసలయ్య ఎంటి బాలు, అంబోజి తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టాలను పరిశీలించిన టిడిపి బృందం

**ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్**

ఇటీవల రాష్ట్రంలో సంభవించిన తుఫాను పంట నష్టాల పరిశీలనలో భాగంగా శుక్రవారం సుడిగాంలో టిడిపి బృందం సందర్శించి పంట నష్టాలను పరిశీలించింది. ఈ సందర్భంగా బృందం నాయకులు మాట్లాడుతూ తుపానుకు నష్టపోయిన రైతుల పంట నష్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ బృందంలో మాజీ ఎమ్మెల్సీ పిరుకట్ల విశ్వప్రసాద్, జెడ్పి మాజీ వైస్ చైర్మన్ కండపు వెంకటరమణ, నియోజకవర్గ పరిశీలకులు బోయిన గోవిందరాజులు, పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట్నాయుడు , మాజీసర్పంచ్ గోరజాణ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు

## అగ్ని అస్త్రంతో తెగులు నివారణ

**ప్రజాశక్తి - పాచిపెంట**

అగ్ని అస్త్రంతో అన్ని రకాల కాయ తోలుచు, ఆకు తినే పురుగుల నివారణకు ఎంతో ఉపయోగపడుతుందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పి.కోనవలసలో రైతు కొట్టాడ సత్యనారాయణ మొక్కజొన్న పొలంలో కత్తెర పురుగు ఉధృతిని గమనించారు.